

-ఎ. సర్వేశ్వరరావు

మా రివ్వక్కరలేదు. ఇచ్చినా నేను తీసుకోను. కాని, ఆ బంట్రోతునూ, గుమాస్తానూ కాస్త చూడండి. పాపం, పేదవాళ్ళు!' అనేవాడు. పార్టీల ఫిర్యాదులు ఎంత ఓపికగా వినేవాడో, గుమాస్తాల కష్టసుఖాలూ అంతే ఓపికతో వినేవాడు. ఎవర్నీ బాధించేవాడు కాదు. చక్కాగా రాజీ కుదిర్చేవాడు. అందుకే అటు ప్రజల్లోనూ, ఇటు డిపార్టుమెంటులోనూ అతను దేవుడయాడు.

అతని కిద్దరే సంతానం. ఇద్దరూ ఆడపిల్లలే. పెద్దమ్మాయి జయలక్ష్మి. చిన్నమ్మాయి రాజ్యలక్ష్మి. బిడ్డలిద్దరి విషయంలో ఎప్పుడూ ఏ లోటూ చేసేవాడు కాదు. అన్నిటా అంతులేని స్వాతంత్ర్యం ఇచ్చాడు. 'తరానికి మచ్చ కలిగే పనెప్పుడూ చేయవద్దు. అది వినా మరేం చేసినా నేను కాదనను. కొడుకులా మీరే, కూతుళ్ళూ మీరే. నా రెండు కళ్ళే మీరు' అనేవాడు.

జయ పి. యు. సి. పాసయినప్పుడే పెళ్ళి చేద్దామనుకున్నారు. కాని, ఆ

అమ్మాయి తనప్పుడే చేసుకోనని ఖండితంగా చెప్పేసింది. ఇంకా చదువు కుంటా నన్నది. చక్రపాణీ కాదనలేదు. శ్రీకాంత్ కాదనలేదు. ఏమంటే, శ్రీకాంత్ అప్పటికి ఎమ్. ఏ. పాసయి కో—ఆపరేటివ్‌లో సెలక్టయి ఉన్నాడు. ట్రెయినింగ్‌కి బొంబాయి వెళ్లవలసి ఉంది. రెండేళ్ళకి గాని అది పూర్తయి ఉద్యోగం రాదు. అందుకే జయ ఇంకా చదువుకోవడం అందరికీ సమ్మత మయింది. పెళ్ళి వాయిదా పడింది.

శ్రీకాంత్ చదువు పూర్తయింది. హైదరాబాద్‌లోనే ఉద్యోగమూ అయింది. జయ బి. ఏ. పాసయింది. అన్ని అడ్డంకులూ తీరాయి. ముహూర్తం నిశ్చయించారు. మరో నెల రోజుల్లో ఆ ఇంట సన్నాయి మోగవలసి ఉంది. కాని, విధివైపరీత్యం వల్ల ఆనందగీతికి బదులు శోకగీతి నాలాపించింది సన్నాయి.

ఉదయమే నిద్ర లేచి కాలకృత్యాలు తీర్చుకుని తోటలోకి వెళ్లి పూలమొక్కల్ని పరామర్శించడం అలవాటు జయలక్ష్మికి. శివశంకరు డప్పుడు నిద్ర లేస్తాడు. తోటలోకి వెడతాడు. పూలమధ్య బిడ్డను చూస్తాడు. అది అతని అలవాటు.

"ఆ గులాబీ బాగా పూస్తోందా? ఆ మల్లె ఏమిటి అలా వాడింది?" అని కాస్సేపు కబుర్లు చెబుతాడు. తరవాతే అన్ని పనులూ. కాని, ఆ వేళ అతనికి జయ తోటలో కనిపించలేదు. లేవలేని అస్వస్థత వస్తే తప్ప తోటలో కనిపించ కుండా ఉండదు జయ. అందుకే వ్యాకుల పాటు చెందాడు శంకరుడు.

"అక్క ఇంకా లేవలేదా, రాజా?" అనడిగాడు రాజ్యలక్ష్మిని.

"ఏమో, నాన్నా! నేను చూడలేదు" అన్నది రాజ్యలక్ష్మి.

లోపలికి వెళ్లి చూసి వచ్చింది

"అక్క ఇంట్లోనూ లేదు, నాన్నా!" అన్నది.

"ఎక్కడికేనా వెళ్లిందా? ఉదయమే దాని స్నేహితు లెవరేనా వచ్చారా?" అనడిగాడు.

"ఏమో, నాన్నా! నేను వంటింట్లో ఉన్నాను. చూడలేదు" అన్నది రాజ్యలక్ష్మి.

కొన్నాళ్ళుగా ఆమె తల్లికి స్వస్థతగా లేదు. మంచంమీదే ఉంటూంది. వంట పనంతా తనే చూసుకుంటూంది రాజ్యలక్ష్మి. బిడ్డ కనిపించకపోవడంతో శివశంకరుడికి మతి పోయినట్టయింది. పిచ్చివాడిలా ఇల్లంతా తిరిగాడు.

"ఏదీ? మా అమ్మ ఏదీ? ఎక్కడికి వెళ్లింది? ఏమయింది?" ఆందోళనతో నౌకర్లను అటూ, ఇటూ పంపించాడు. ఎక్కడికి వెళ్లిందని వెదుకుతారు? ఏమయిందని దర్యాప్తు చేస్తారు? జాడ లేదు. పలు సంశయాలతో అతని మనసు సతమతమయింది. కాని, ఆ రాత్రి వైజాగ్ కేంపు వెళ్లి తిరిగి వచ్చిన రెవెన్యూ ఇన్‌స్పెక్టరు శ్యామలరావు చెప్పిన కబురు అతని గుండెనే చీల్చి వేసింది.

కాఫీ తాగుదామని హోటల్లో అడుగు పెట్టాడు శ్యామలరావు. కాఫీ తాగుతూ కనిపించా డక్కడ రాజు. రాజు శివశంకరుని జీపు డ్రైవరు.

"ఏం, రాజూ, ఇక్కడున్నావ్? అయ్యగారుగాని వచ్చారా?" అని పలకరించాడు శ్యామలరావు. ఇతన్ని చూసి రాజు ఎందుకో గతుక్కుమన్నాడు. మెల్లగా సర్దుకుని— "లేదు, సార్. నేనే వచ్చాను" అన్నాడు. శ్యామలరావు ఏదో అనేంతలో బేరర్ వచ్చి—"పైన కాఫీ ఇచ్చి వచ్చాను, సార్. బిల్ రాసేయమంటారా?" అనడిగాడు రాజుని.

"ఆఁ" అన్నాడు రాజు.

శ్యామలరావు విస్మయపడి, "పైన ఎవరున్నారు, రాజూ!" అనడిగాడు.

"అయ్యగారి పెద్దమ్మాయిగారు, సార్!" అన్నాడు రాజు.

"జయలక్ష్మిగారా!" శ్యామలరావు మరింత విస్మయం చెందాడు.

"అవును, సార్! వారు అర్జెంటుగా రాయపూర్ వెళ్ళాలట. నేను సెలవు పెట్టి విజయనగరం వెళతానంటే తోడుండి బండి ఎక్కించమన్నారు అయ్యగారు" అన్నాడు రాజు.

"పసి!" శ్యామలరావు కాఫీ తాగడ మయింది. టైమ్ చూశాడు.

"రాయపూర్ బండి ఆరింటికి కదూ? అరగంట టైముంది. పోదామా?" అన్నాడు.

"ఆఁ!" రాజు లేచి పైకి వెళ్లాడు. రెండు నిమిషాల అనంతరం దిగి వచ్చాడు. అతని వెనకే జయలక్ష్మి. ఆమెను చూస్తూనే నమస్కారం చేశాడు శ్యామలరావు.

"నమస్తే!" అన్నది జయలక్ష్మి. శ్యామలరావే హోటలు బిల్లు చెల్లించాడు.

"బండి తెచ్చారా?" అనడిగాడు శ్యామలరావు.

"లేదు, సార్. అయ్యగారు వద్దన్నారు. బస్సులో వచ్చాం."

"సినిమాకే వద్దంటారుగా— ఇక్కడి కెలా పంపిస్తారు?" అని.

"మన చౌదరి కారు మధ్యాహ్న మెందుకో వచ్చింది ఇక్కడికి. తిరిగి ఖాళీగా పోతానంటే నేనే ఉండమన్నాను కలిసి పోదామని" అని ఒక కారు దగ్గరికి నడిచాడు.

ముగ్గురూ కార్లో కూర్చున్నారు. కారు కదిలింది.

విజయనగరాని కొకటీ, రాయపూర్ కొకటీ టికెట్లు తనే కొన్నాడు శ్యామలరావు. దగ్గర ఉండి బండి ఎక్కించాడు. తిరిగి వచ్చాడు. తను




తెచ్చిన టపా ఇచ్చివేద్దామని బంగళాకు వచ్చాడు.

"అయ్యగారి కేం బాగులేదు, సార్! పడుకున్నారు" అన్నాడు దఫేదారు.

"అరె! ఏమయింది?" వ్యాకుల పాటుతో అడిగాడు శ్యామలరావు.

"ఏం చెప్పమంటారు, సార్! పెద్దమ్మాయిగారు ఉదయంనుంచీ కనిపించడం లేదు. ఆ బెంగతో—"

శ్యామలరావుకి మతి పోయినట్లయింది.

'అమ్మాయిగారు ఊరెళితే కనిపించడం లేదంటాడేంటి వీడు!' అనుకుని— "అదేమిటోయ్? అమ్మాయిగారు రాయ్‌పూర్ వెళ్లారుగా!" అన్నాడు.

"రాయపూరెళ్లారా? ఎవరు చెప్పారు, సార్?" తెల్ల ముఖం వేశాడు దఫేదారు.

"ఎవరు చెప్పడమేమిటి? నేనే బండెక్కించి వస్తే!"

ఆ మాట విని దూసుకు వచ్చాడు శివశంకరుడు.

"ఏమిటి, శ్యామలరావ్, నువ్వన్నది? అమ్మాయిని నువ్వు బండెక్కించావా?"

"అవును, సార్. అనుకోకుండా కలిశారు" అని జరిగిందంతా చెప్పాడు.

అంతా విని కుప్పకూలిపోయాడు శివశంకరుడు.

"నా కొంప ముంచావు కదయ్యా, బాబూ!"

"అయాం సారీ, సార్. ఇలా అని నే ననుకోలేకపోయాను. ఆ దొంగ రాస్కెల్ ఎంత నేర్పుగా నాటకమాడాడు!" అని కోపంతో రాజుని నాలుగు తిట్టి, "మీరు మరేం గాభరా పడకండి, సార్. నే నిప్పుడే విజయనగరం కాల్ బుక్ చేస్తాను. మన మౌళికి చెప్పి స్టేషనుకు వెళ్ళి ఆ వెధవని పట్టుకోమంటాను" అని వెళ్లబోయాడు.

"లాభం లేదు, శ్యామలరావ్, లాభం లేదు. ఈపాటి కా ట్రెయిన్ విజయనగరం దాటేసి ఉంటుంది. ఉండక పోయినా అమ్మాయి ఇక తిరిగి రాదు. వచ్చినా పోయిన ప్రతిష్ఠ రానేరాదు" అన్నాడు శివశంకరుడు బేలగా రోదిస్తూ.

"వెళ్లనీండి, నాన్నా! ఏమయితే అదే అవుతుంది. మీరు వెళ్ళండి, ఇన్‌స్పెక్టరు గారూ!" అన్నది రాజ్యలక్ష్మి. శ్యామలరావు పరుగు తీశాడు. శివశంకరుడు తోట చేరి భోరున విలపించసాగాడు.

'ఎంత పని చేశావు, అమ్మా! నీవు లేనిదే నేను బ్రతకలేనని తెలిసీ ఎంత పని చేశావు! నీ మనసిదని నాకు చెబితే నేను కాదనేవాడినా? ఇప్పు డీ అప్రతిష్ఠ నెలా భరించడం? తెల్లారితే ఎందరి ముఖాలు చూడాలి నేను? ఏమని వినాలి వారి మాటలు?

శివశంకరం గా రమ్మాయి లేచి పోయింది.

డ్రైవరుగాడితో మన ఆర్. డి. ఓ. గా రమ్మాయి లేచిపోయింది. అయ్యగా రమ్మాయి లేచిపోయింది, లేచిపోయింది, పోయింది. . .'

అబ్బ! ఊహే దుస్సహమయి పోతూంది. నిలువలేకపోయాడు. అంతులేని ఆవేశం ఒక క్షణం. భరించరాని ఆవేదన కాస్సేపు. దీర్ఘమైన యోచన మరొక క్షణం.




రాత్రంతా అలానే గడిచింది. ఎవరెవరో వస్తున్నారు. ఏదో పనిమీద కావచ్చు. కాని,వారంతా అతని కొకలాగే కనిపించారు.

"అయ్యో, పాపం! మీ అమ్మాయి లేచిపోయిందటగా?" అంటారనే, ఎదుట బాధ పడి వెనక నవ్వుతారనే! అందుకే ఎవరికీ కనిపించ లేదా రోజు. మూడు గంటలకు దఫేదార్ని పిలిచి ఒక టెలిగ్రామ్ ఇచ్చి రమ్మన్నాడు. ఆఫీసు పని హెడ్‌క్లార్కుని చూసుకోమన్నాడు అంతే.

• • •

"టెలిగ్రామ్ సాయంకాల మందింది. 'స్టార్ట్ ఎట్‌వన్స్' అని ఉంది. అంతే. ఏమయిందో తెలియదు. వెంటనే వెళదా మంటే బండిగాని, బస్సుగాని లేదు. పరిస్థితి ఇదని తెలిస్తే ఏ టాక్సీలోనో వెళ్ళేవాణ్ణి. కాని, తెలియదు. ఉదయం ట్రెయిన్‌లో వెళదామనుకున్నాను. అర్ధ రాత్రి మరో టెలిగ్రామ్ వచ్చింది— శివశంకరుడు విషం తాగి మరణించాడని. వెంటనే టాక్సీ తీసుకుని వెళ్లాను. ఏముం దక్కడ? అంతా అయిపోయింది. భార్యాబిడ్డల కత నేం చెప్పి పోలేదు. నాకు మాత్రం చిన్న ఉత్తరం మిగిల్చాడు. ఇస్తాను. చదువు, సారథీ! పెట్టెలో ఉంది" అని లేవబోయాడు చక్రపాణి.

అతణ్ణి వారిస్తూ, "అక్కర్లేదు. మీరు చెప్పండి" అన్నాడు సారథి. ఉత్కంఠతో చూస్తూ.

'చిన్నప్పటినుంచీ నే నెలా పెరిగానో నీకు తెలుసు, పాణీ! ఇలాటి పరిస్థితి నే నెన్నడూ ఊహించలేదు. అందుకే తట్టుకోలేకపోతున్నాను. మరణం తప్ప మరో మార్గం కనిపించలేదు.

నెల రోజుల్లో మనం వియ్యంకులం కావలసి ఉంది. కాని, కాలేకపోతున్నామనే దిగులు. శ్రీకాంత్‌కి ఇష్టమయితే, రాజా అవునంటే వాళ్లకి పెళ్లి చేసెయ్. లేదూ— అదీ ఎవడితోనో పోతానంటే పోనీ. అభ్యంతర పెట్టకు. నీ చెల్లి సంగతి నీ కేం చెప్పక్కర లేదు. నీకు తెలుసు. అదెన్నాళ్లో బ్రతకదు. ఆ కొన్నాళ్లు నీ దగ్గరే ఉండనీ. నువ్వు నా కంటె పెద్ద వాడివి. కష్టసుఖాలు తెలిసినవాడివి. ధైర్య వంతుడివి. అందుకే ఈ సమస్యల్ని నీకు వదులుతున్నా. . .' అని వ్రాశాడు.

"చూడు వాడి మాట. నేను ధైర్య వంతుణ్ణట! ఎందుక్కాదు? ఇవన్నీ అనుభవించడానికి ధైర్యమే కాదు, ఇంకే దన్నా ఉండి ఉండాలి" అని నిట్టూర్చి అన్నాడు: "శ్రాద్ధకర్మలు పూర్తిచేసి తల్లీ కూతుళ్లను నా వెంట తీసుకు వచ్చేశాను. శంకరం వ్రాసిన ఉత్తరం శ్రీకాంత్‌కి చూపించాను.

'ఏమంటావురా?' అనడిగాను.

'రాజా వడిగారా? ఏమన్న దది?' అన్నాడు వాడు.

'దాని సంగతి నే చూసుకుంటా. ముందు నీ సంగతి చెప్పు."

'అది ఇష్టపడితే నా కేం అభ్యంతరం లేదు. అలాగని దాన్ని బలవంతపెట్టకండి' అన్నాడు.

'బలవంతమేం లేదు. ఇష్టపడితేనే' అని దాన్నికూడా అడిగాను. అదీ ఇష్టపడింది. వెంటనే పెళ్లి చేసేశాం. మొదట అనుకున్న ముహూర్తానికే జరిగింది. ఎందు కంత తొందర పడ్డానా అని ఈ నాడు పశ్చాత్తాప పడుతున్నాను. కాని, ఆ నాడు మృత్యుముఖంలో ఉన్న దాని తల్లి సంతోషాని కలా చెయ్యవలసి వచ్చింది. ఎవరి సంతోషానికి చేసినా మనం ఆశించేది వీరి సుఖసంతోషాలు. కాని, అవే మృగ్యమయిపోయాయి. దానిదేం నేరం లేదు, బాబూ! కాని, వీడే. అన్నీ చెప్పి ఇంకా ఇలా అఘోరిస్తున్నాడు. ప్రేమించవచ్చు. మనసు మార్చుకోవ డానికి వ్యవధీ అవసరమే. కాని గుర్తించని ప్రేమకీ, త్యాగానికీ విలువేమిటి? పమాన బుద్ధితో నువ్వు ఆఘ్రాణించినా, పువ్వు ఇచ్చే అనుభూతి వేరు, పుడక ఇచ్చే అనుభూతి వేరు. అన్నీ తెలిసి, చదువు, సంస్కారం ఉండి ఒక డ్రైవరు వెధవతో లేచిపోయిన ఆ దెష్ట కోసం మతి పోగొట్టుకుని, ఉన్నవాళ్లను నానా హింసా పెడుతున్నాడు. తన హోదా, తన పరువూ, తన ఉనికీ—అన్నీ మరిచి ప్రవర్తిస్తున్నాడు. ఈ మూరత్వానికి అర్థమేమిటి?

"ఒక్క విషయ మాలోచించు, సారథీ! తండ్రిలా అదీ చాలా సెన్సిటివ్. నీ అక్క తిరుగుబోతు. నీ భర్త తాగుబోతు అని ఎవరన్నా అంటే దాని కెలా ఉంటుంది? ఆ బాధతో ఏ ఘడియ ఏం చేస్తుందో నని నా బెంగ. ఆ బెంగతోనే నేను క్రుంగి, కృశించి, నశించి పోతానేమో?"

"పాణిగారూ!" విచలితు డయ్యాడు సారథి.

"ఎంత సెన్సిటివ్ అయినా రాజా ఎన్నటికీ ఏం చేయదు. మీరు అనవసరంగా మనసు పాడు చేసుకోకండి. స్నేహితుడిగా నేను చేయగలిగిందల్లా చేస్తాను. మీరు విశ్రాంతిగా ఉండండి" అన్నాడు చక్రపాణి, రెండు చేతులు పట్టుకుని సానునయంగా చూస్తూ. ఆ చేతుల్లో తన ముఖం వాల్చి కన్నీటితో తడుపుతూ అన్నాడు. చక్రపాణి: "నాకు మిగిలిన ఆశ నువ్వొక్కడివే, బాబూ! మనిషి కేమన్నా చేయాలంటే బంధువులూ, ఆశ్రితులూ కాదు. స్నేహితులే చేయాలి. ఆ భారం నువ్వే వహించాలి."

"తప్పకుండా వహిస్తాను, పాణిగారూ! కాని, మీరు ఆలోచనలతో మనసు పాడు చేసుకుని క్రుంగిపోతే మే మేం కావాలి? మీ చేయూతతో నే నంతా చక్కబెడ తాను. మీరు విశ్రాంతిగా ఉండండి."

"అలాగే, బాబూ! నీ మాట వింటాను. ఇక నే నేం పట్టించుకోను." స్థిర కంఠంతో అన్నాడు చక్రపాణి.

"నువ్వేం చేయకపోయినా ఆ మాట నా కెంత సాంత్వన కలిగించిందో చెప్ప లేను, బాబూ! ఇలాటి ఓదార్పు నా కెన్నడూ లభించ లేదు" అని హఠాత్తుగా ఉద్రిక్తుడై,

"నా పెద్ద కొడుకు మరణించలేదు, సారథీ! ఇదిగో, నా ఎదుటే ఉన్నాడు. వాడే అన్నీ చూసుకుంటాడు. నా కింకేం బెంగ?" అన్నాడు.

"బాబాయ్!" ప్రేమావేశంతో అతణ్ణి వాటేసుకున్నాడు సారథి.

"మీ రింక పడుకోండి, బాబాయ్. చాలా రాత్రయింది" అని వారి మెడ వరకూ దుప్పటి కప్పి తను లేచాడు.

"నువ్వూ ఇక్కడే పడుకో, బాబూ! ఇక రూముకేం వెళతావు? ఉదయాన్నే వెళ్లవచ్చు" అన్నాడు చక్రపాణి.

"అలాగే." లైట్ ఆర్పి మరగాల్ను అమర్చుకుని ముందు గదిలోకి నడిచాడు. మంచంమీద పక్క వేసి ఉంది.

"మీ రిక్కడ పడుకోండి, విజయ్ బాబూ!" అన్నది రాజ్యలక్ష్మి. కిటికీ చెంత కుర్చీలో కూర్చున్న దల్లా లేచి. "అలాగే" అని, "నువ్వింకా పడుకో లేదా, రాజా!" అన్నాడు.

రాజ్యలక్ష్మి మాట్లాడలేదు.

"శ్రీకాంత్ ఇంకా ఇల్లు చేరలేదా" అనడిగాడు.


"వచ్చారు" అని మెల్లగా లోపలికి వెళ్లిపోయింది.

నిట్టూర్చాడు సారథి. వెళ్ళి కుర్చీలో కూర్చున్నాడు. సిగరెట్ వెలిగించాడు.

తనెవరు? ఈ ఇంటికీ, తనకూ ఉన్న సంబంధ మేమిటి?ఒకనాడు అనుకో కుండా స్నేహమయింది. ఆత్మీయత పెరి గింది. ఈ నాడు పెద్ద కొడుకే అయాడు. ఆ స్నేహసౌజన్యాలకి ప్రతిగా తనేం ఇవ్వగలడు? ఏం చేస్తే చక్రపాణిగారి మనసు కుదుటపడుతుంది? ఏం చేస్తే రాజ్యలక్ష్మి బ్రతుకు బాగుపడుతుంది?

విశ్రాంతి

చిత్రం— పి. బాబు (మద్రాసు—4)



మళ్ళీ ఆ వదనంలో నవ్వుల్ని తనెప్పుడు చూడగలడు? అసలు చూడగలడా?

* * *

ఆ నాటి రాత్రి పని ఉండి లాయరు నాకరాజా ఇంటికి వెళ్ళాడు. 'బంద్' కారణంగా బస్సులూ, రిక్షాలూ తిరగడం లేదన్న సంగతి మరిచిపోయి చాలా రాత్రి వరకు ఉండిపోయా డక్కడ. కాళ్ళీడ్చు కుంటూ బయలుదేరా డింటికి. అజంతా హోటలు దగ్గర ఎవరో వ్యక్తి తూలుతూ, నడవలేక, నిలవలేక నానా అవస్థా పడు తున్నాడు. జాలి వేసింది మొదట. కాని, తరవాత ఎందుకో అసహ్యం వేసింది. పీకలదాకా తాగకపోతే నేం? అలా సతమత మవకపోతేనేం? అనుకున్నాడు. ఎవ రెలా ఏడిస్తే తనకేం, తన దారిని తను పోక. అనుకున్నాడే గాని, మనసు ఒప్పలేదు. చూస్తూ ఒక వ్యక్తి నలా ఆపదలో విడిచిపోవడం మానవత్వ మంగీకరించని పని. అందుకే ఆగాడు. అతని దగ్గరికి నడిచాడు. సరిగా అప్పుడే ఆ వ్యక్తి కాలి కేదో తగిలి తట్టుకోలేక బోర్లా పడి పోయాడు.

"అరే!" బలమంతా ఒంటి కాలిమీద నిలిపి, మరగాలు అదిమి పట్టి, వంగి అతని చేయి పట్టుకుని లేవనెత్తాడు.

"థాంక్యూ!"

"ఎక్కడికి వెళ్ళాలి మీరు? ఇంటి కేనా?" అడిగాడు. ఆ వ్యక్తి బదులు చెప్పలేదు. అవుననో, కాదనో అర్థంగాని రీతిలో తల ఊపాడు.

"ఎక్కడ మీ ఇల్లు? గుర్తుందా? మరిచిపోయారా?"

ఇల్లనగానే తెలివి వచ్చిందేమో— ఫక్కుమని నవ్వాడు.

"అది మరిచిపోతే ఇక్క డెందు కుంటాం? హాయిగా అక్కడే పడుకుంటాం" అన్నాడు, అస్తవ్యస్తమయిన ఉచ్చారణతో.

"సరే. ఇటు రండి. నా భుజంమీద చేయి వేసి నడవండి. మరీ భారం మోపకండి. నేమా పడతాను. ఒంటికాలి వాణ్ణి" అతను మళ్ళీ నవ్వాడు.

"ఒంటికాలా? ఎవరికి? నీకా? బలే! అయినా నా కన్నా నువ్వే బాగా నడుస్తున్నావ్."

"పదండి."

"ఆల్‌రైట్!" తన భుజం మీద చేయి వేశా డతను.

అతణ్ణి ఈడుస్తూ నడవడం చాలా కష్టంగా ఉంది. కాని, ఏం చేయాలి? వదిలేస్తే పడిపోతాడు. ఎవరన్నా కనిపిస్తే సాయం కోరవచ్చనుకుంటే రోడ్డుమీద ఎవరూ లేరు. ఎవ రుంటారు? అంతా ఆదమరిచి నిదురించే వేళ? అలాగే కష్టపడుతూ జంక్షను వరకూ లాక్కుని వచ్చాడు. ఇక రానని మొరాయించా డతను.

"నే రాను. నా రిక్షా రావాలి. ఏదీ నా రిక్షా?" అన్నాడు.

"వస్తుంది. పదండి. మీ ఇల్లెక్కడో చెప్పండి."

"నా కేం తెలుసు? దానికంతా తెలుసు. అందుకే దాన్ని రమ్మను" అన్నాడు.

"ఈ వేళ రిక్షాలు రావు. బంద్. నా మాట వినండి. మెల్లగా పోదాం. ఇల్లెక్కడో గుర్తు చెప్పండి."

అతను చెప్పలేదు. ఏదో వాగుతున్నాడు.

"నన్ను బాధ పెట్టకండి. చెప్పండి."

"ఎవరు నువ్వు? నన్నెందు కిలా పట్టుకున్నావు? ఏంకావాలి నీకు? డబ్బా?" అని జేబులోంచి పర్సు తీసి విసిరాడు.

"తీసుకో. ఈ డబ్బు కోసమే అంతా గడ్డి తినేది. ఈ డబ్బుకే అంతా పడి చచ్చేది. మూర్ఖుడా! డబ్బుతో సుఖ ముందనుకుంటున్నావా? లేదు. అస లెక్కడా లేదు సుఖం. లేదు. నిజంగానే లేదు" అని బావురుమని ఏడవసాగాడు. బిత్తరపోయాడు తను. అతడు ఏడు స్తూనే ఏదో అంటున్నాడు. ఏమంటు న్నాడో, ఆ మాటల కర్థమేమిటో, అనుబంధమేమిటో ఆ విధాతకే తెలియాలి.

"నా మాట వినండి. పోదాం, పదండి." బ్రతిమిలాడాడు. కాని, అతను కదల లేదు. ఇప్పు డేం చేయాలి? అతను రాడు. బలవంతాన కదిలిద్దామంటే తను కుంటి వాడు. ఏమీ చేయలేడు. తన దారిని తను పోదామన్నా వీల్లేదు. డబ్బుతో ఉన్న పర్సు ఉంది. అతనికి ఇచ్చేద్దా మంటే ఎవడో తుంటరి దాన్ని కాజేయక పోడు. ఏ ఉదయాన్నో తీసుకువెళ్ళి ఇద్దామంటే అడ్రెసు ఎలా తెలుస్తుంది? ఏం చేయాలా అని సతమతమవుతున్నం తలో ఒక వ్యక్తి పరుగున వస్తూ కనిపించాడు. తను పిలుద్దామనుకున్నంత లోనే అతను ఆగి, "అరె! వచ్చేస్తున్నారా, బాబూ! బండి తెద్దామని ఎంత యాతన పడ్డా కుదరలేదు, బాబూ! నా యాల్లంతా అడ్డం బడ్డారు" అన్నాడు.

"ఎవరు నువ్వు?" అడిగాడు తను.

"రిక్షా రంగణ్ణి, బాబూ! రోజా అయ్యగారు నా బండిలోనే ఇంటి కొస్తారు. ఇయేల బందు గందా? బండి తీసిలేదు మా సంగం. . ."

"సరే. రక్షించావులే. పద. పట్టుకో, నడిపించుకు పోదాం" అని, "ఎక్కడ వీరిల్లు?" అనడిగాడు తను.

"పక్కనే, బాబూ. చక్రపానిగారు తెలీదా— పాత ఎమ్మెల్లే గారు? ఆరి బాబుగారే."

"పెద్దబ్బాయా?"

"కాదు, బాబూ! పెద్దబ్బా యెక్కు డున్నారు! మిల్ట్రీ కెల్లిపోలేదా?"

దిమ్మెరపోయాడు తను.

"అంటే ఇతను శ్రీకాంతా?" తల తిరిగిపోసాగింది.

"రండి, బాబూ!" ఒడుపుగా అతణ్ణి భుజాన్నేసుకుని వెనుతిరిగి అన్నాడు రంగడు.

"ఆఁ" అని తేరుకుని, "నే నెందుకు? నీ కిల్లు తెలుసుగా— అప్పగించేయ్. మా ఇల్లిక్కడే. నే పోతా" అన్నాడు.

"సరేనయ్యా!" వాడు వెళ్ళిపోయాడు.

తను రూమ్ చేరాడు. బట్టలు మారు స్తుంటే పర్సు కనపడింది.

పర్సు తన దగ్గరే ఉంచుకోవడం ఎంత పొరపాటు! వాళ్లేమనుకుంటారో? అప్పుడే వెళ్ళి ఇచ్చేసి రావలసింది. పోనీ, ఇప్పుడు వెళ్ళి ఇచ్చేస్తే? కాని, కదలలేని స్థితి అయింది తన పని.

అనుకుంటే అనుకోనీ. ఉదయాన్నే వెళ్ళి ఇచ్చేయవచ్చు అనుకున్నాడు. పర్సు పెట్టెలో పెడుతూ వద్దనుకుం టూనే విప్పి చూశాడు. డబ్బు చాలా ఉంది. దానికన్నా అందులో ఉన్న ఫోటోయే తనకి విభ్రమ కలిగించింది. ఆ ఫోటో ఎవరిదో తనకు తెలుసు. కాని, అది అందులో ఉండటమే తన కర్థంగాని విషయమయింది. దానితో ఆ రేయి తన కిక నిదురే లేదు.

ఉదయమే వారి ఇంటికి వెళ్ళాడు. తలుపు తీసే ఉంది. గదిలో పడక్కుర్చీలో కూర్చుని పేపరు చదువుతున్నారు చక్రపాణి. మెల్లగా పిలిచాడు.

పేపరు దించి, తల పైకెత్తి అడిగాడు— "ఎవరు కావాలి?" అని.

"శ్రీకాంత్‌గారు లేరాండి?"

"ఉన్నాడు. ఇంకా లేవనట్టుంది. ఏం?"

గదిలోకి వెళ్ళాడు. తలుపుకి చేరబడి జేబులోంచి పర్సు తీశాడు.

"ఇలా రండి, బాబూ! కూర్చోండి" అన్నాడు చక్రపాణి.


"ఫర్వాలేదండి" అని పర్సు వారి కిచ్చి, "లేవాక మీ అబ్బాయి కిది ఇచ్చెయ్యండి" అన్నాడు.

చక్రపాణి విస్మయంగా చూసి, "ఇది నీ చేతి కెలా వచ్చింది?" అనడిగారు.

"రాత్రి పారేసుకున్నారు వారు."

"అంటే. . . రాత్రి వాణ్ణి ఇల్లు చేర్చింది నువ్వే నన్న మాట!" అని,

జలక్రీడలు — చిత్రం— పి. బాలు (మద్రాసు—4)



"కూర్చో, బాబూ" అన్నారు. తను కూర్చున్నాడు.

"చేర్పింది నేనే అంటే పూర్తిగా నేనూ కాదండీ. జంక్షను వరకే నేను తీసుకు రాగలిగాను. మీ ఇల్లంటే నాకు తెలుసు. కాని, అతను ఫలానా అని తెలియదు. వారూ చెప్పలేని స్థితిలో ఉన్నారు. ఏం చేయాలా అని సతమత మవుతుంటే దేవుడిలా, రోజూ వారిని ఇల్లు చేర్చే రిక్షా వాడట—వాడు వచ్చాడు. వాడి సాయంతో ఇల్లు చేర్చాను" అన్నాడు.

"మేమూ ఆదే బాధ పడ్డాం, బాబూ! రిక్షాలు లేవు, బస్సులు లేవు, టాక్సీలు తిరగడం లేదు— ఇంటి కెలా వస్తాడా అని. మా రవిని పంపించాను. వాడు నాలుగు బార్లూ తిరిగి ఎక్కడా లేడంటూ తిరిగి వచ్చాడు." మాట్లాడుతూనే ఆయన పర్సు తీసి డబ్బు లెక్క పెట్టాడు. ఫోటో చూసిన అతని ముఖం మ్లాన మయిపోయింది.

"దేవుడిలా మీరు కనిపించారు. లేక పోతే రాత్రి మా వాడి పొట్లు కుక్కలు కూడా పడవు" అన్నారు.

"అలా అనకండి. నేను చేసిందేం లేదు. కాస్త ఆలస్యమయినా రిక్షావాడు వెళ్ళేవాడే."

"వెడతాడు. తీసుకు వస్తాడు. కాని, దీని మాటేమిటి?" అని డబ్బు చూపించి, "చూశావా, ఎంతుందో? ఒకటా రెండా— ఎనిమిది వందలు. రిక్షావాడి కంటబడితే ఇది చస్తే మరి రాదు. . ." అన్నాడు.

తనేం అనలేదు.

"మీ పేరేమిటి, బాబూ!" అడిగారు.

"విజయసారథి."

"ఎక్కడ పని చేస్తున్నావు, బాబూ!"

"ఈ మధ్యనే ఆర్మీనుండి డిస్ఛార్జయి వచ్చాను" అన్నాడు.

"ఆర్మీకి వెళ్ళావా" అని తన కుంటి కాలి వంక చూసి, "అక్కడిదేనా ఆ అఘాతం" అన్నారు.

"అవునండి. హడావుడిగా ట్రక్కు లోంచి దిగుతూ కాలు జారి పడ్డాను. వెనక నుండి మరో ట్రక్కు వచ్చి కాలి మీదించి వెళ్ళిపోయింది."

"అయ్యో!"

"ఏం చేస్తాం చెప్పండి! రాత అలా ఉంది. అంతా ఫీల్డులోకి వెళ్ళి దెబ్బలు తింటే నేను ఆదినే అప్రకయి పోయాను."

"మరిప్పుడేం చేస్తున్నావు, బాబూ!"

"ఏం లేదండి. గవర్నమెంటు కాంపెన్సేషనుగా కొంత ఇచ్చింది. ప్రస్తుతం దానితో కాలక్షేపం అవుతోంది. ఏదో చూసుకోవాలి." అలా వారితో కష్టసుఖాలు మాట్లాడుతుంటే ఎంతో రిలీఫ్‌గా ఉంది. లోగదిలో చప్పుడు కాగా అటు చూసి "ఎవరది, రాజా?" అన్నారు వారు.

"ఏం మామయ్యా!" మనిషి కనిపించ లేదు. మాట వినిపించింది. తనకి తెలుసు ఆ స్వరం ఎవరిదో.




everest/364a/ACW Tel

"ఇలా రా, అమ్మా. రాత్రి మీ బావని ఇల్లు చేర్చింది వీరే. వచ్చి నమస్కారం చెయ్యి" అన్నారు చక్రపాణి. లోపలికి వచ్చింది రాజ్యలక్ష్మి. తనని చూసి కొయ్యబారి పోయింది.

"మీరా!"

"బాగున్నారా, రాజ్యలక్ష్మీ!" తలవని తలంపుగా ఆమె పేరు ఉచ్చరించా డతను.

చక్రపాణి విస్మితుడయాడు.

"అరె. మా రాజును మీకు ముందే తెలుసా?" అనడిగారు.

"తెలుసు. నేను కొన్నాళ్ళు నర్సీపట్నంలో పని చేశాను. అప్పుడే శంకరం గారితో పరిచయమయింది. వారికి మంచి స్నేహితుణ్ణి నేను. రోజూ సాయంకాలం చదరంగ మాడేవాళ్ళం."

చక్రపాణి నవ్వారు. "చదరంగమా? అదీ—అలా చెప్పు" అని, "చదరంగ మంటే వాడికి ప్రాణం. చివరికి వాడి జీవితమే ఓ చదరంగమయిపోయింది. వాడు వేసిన ఎత్తుకు ఎదురేసి విధి వాణ్ణి చిత్తు చేసేసింది" అని నిట్టూర్చారు.

"ఇదిగో, అమ్మా, తీసుకువెళ్ళి అబ్బాయి కివ్వు. వాడిదే. రాత్రి గలాటాలో పారేసుకున్నాడట."

పర్సు తీసుకుని లోపలికి వెళ్ళిపోయింది రాజ్యలక్ష్మి.

"తండ్రి అంటే దానికి పంచ ప్రాణాలు, బాబూ! ఆ ప్రసక్తి వస్తే అది ఈ మనిషే కాదు" అన్నారు.

"ఎవరయినా అంతే, పాణిగారూ! ఏమంటే, శంకరంగా రలాటివారు. పరాయివారికి, నాకూ ఎంతో భేదం. కాని, నను వయస్కుల్లా నాతో ఆడేవారు. కబుర్లు చెప్పేవారు. అంత ఆత్మీయత ఉంది. వారిని చివరి దశలో చూడలేక పోయాను. ఆ దిగులు ఏ నాటికీ తీరదు."

తల వంచించి బాధగా చూశారు చక్రపాణి.

"విధి చాలా చిత్రమైంది, పాణిగారూ! ఎవర్ని, ఎప్పుడు, ఎందుకు కలుపుతుందో, ఎందుకు విడదీస్తుందో అర్థం కాదు. వారి మరణానికి రెండు రోజుల ముందు నాకు రాజమండ్రి ట్రాన్స్‌ఫరయి వెళ్ళిపోవలసి వచ్చింది. చెప్పడానికని వెళితే ఎంతో బాధ పడ్డారు.

'రాజమండ్రి చాలా మంచి ఊరు, బాబూ! ఆరోగ్యం బాగుంటుంది. వెళ్ళు. అప్పుడప్పుడు ఉత్తరాలు వ్రాస్తూండు' అన్నారు. నేను బయలుదేరే ముందు మా ఊర్నించి టెలిగ్రామ్ వచ్చింది— మా అమ్మకి సీరియస్‌గా ఉందని. వెంటనే రాజమండ్రికి బదులు మా ఊరు వెళ్ళి పోయాను. అమ్మను తీసుకువెళ్ళి కాకినాడ హాస్పిటల్లో జాయిన్ చేశాను. పది రోజులు తగ్గుతూ, హెచ్చుతూ చివరికి కన్ను మూసింది. రాజమండ్రి వెళ్ళి డ్యూటీలో జాయినవుదా మనుకున్నాను. కాని, దారిలోనే టైఫాయిడ్ పట్టుకుంది. మా ఊరు వెళ్ళాను. ఇరవై ఒక్క రోజులు నన్ను బందీ చేసింది. తరవాత రాజమండ్రి వెళ్ళాను. ఎప్పుడో రాజ్యలక్ష్మి వ్రాసిన ఉత్తర ముం దక్కడ. చదివాను. తండ్రి పోయారంటూ వ్రాసింది. వెంటనే బయలుదేరి నర్సీపట్నం వెళ్ళాను. అక్కడ లేరు వాళ్ళు. మీరు తీసుకు వెళ్ళారనీ, ఇక్కడే ఉన్నారనీ తెలిసింది. ఇక్కడకు వచ్చాను. ఆ రోజే పెళ్ళి జరుగుతోంది..."

"అరె! పెళ్ళికి మీరు వచ్చారా? కాని, నా కెక్కడా కనిపించినట్టు లేదే" అన్నారు.

"లేదు. నే నెవరికీ కనిపించలేదు" అని ఆగి, "ఏమంటే, మీ రెవర్నీ ఎరగను నేను. అమ్మగారికి అంత పరిచయం లేదు. తెలిసిందల్లా రాజ్యలక్ష్మి ఒక్కతే. అర్థం చేసుకుంటే ఫర్వాలేదు. కాని, అపార్థం చేసుకోవాలంటే ఎంతో ఉంటుంది. అందుకే పలకరించి వెళ్ళి పోయాను."

"ఏ అనుమానం కూలా! భలేవాడి వయ్యా!" అని, "అయితే, ఇక్కడికి వచ్చి ఎన్నాళ్ళయింది?" అనడిగారు.

"నెలవుతుందండి."

"అంతకుముందు?"

"ఆర్మీ" అని నిట్టూర్చి, "అమ్మ పోయిన తరవాత నా కంతా అయోమయమై పోయింది, పాణిగారూ! జీవితం మీదే విరక్తి పుట్టింది. ఎటో పోదామను కున్నాను. కాని, 'అవకాశమున్న వారల్లా ఆర్మీలో చేరండి' అన్న నినాదాలు న న్నాకర్షించినాయి. వెంటనే వెళ్ళి చేరి పోయాను. కాని, అక్కడా స్థిరం లేక పోయింది" అన్నాడు.

చక్రపాణిగారు మాట్లాడ లేదు. ఏదో ఆలోచించసాగారు.


"ఇక్కడికి వచ్చాక మీ ఇంటికి వద్దామనుకున్నాను. కాని, మళ్ళీ అదే అనుమానం న న్నడ్డేసింది."

"భలేవాడివయ్యా, బాబూ! పోనీ, ఇప్పుడేనా వచ్చావ్. ఇప్పుడూ అనుమాన పడి..."

"రాక తప్పింది కాదు. ఏమంటే, పర్సులో చాలా డబ్బుంది."

"మంచి పనే. కాని, ఇంకెప్పుడూ అలా చేయకు. మా వంశంలో అలాటి అపార్థాలూ, అనుమానాలూ లేవు. ఈ వేళనుంచీ నువ్వు నా స్నేహితుడివి. రోజూ రావాలి. చదరంగ మాడాలి. అంతే. ఇది నా కోరిక. కోరిక కా దది. ఆజ్ఞ."

"అలాగే" అన్నాడు తను.



మాతృమూర్తి చిత్రం—ఎస్. జె. నరసింహారెడ్డి (సికిందరాబాద్)

"మా పెద్దవాడూ నీ లాగే ఆర్మీకి వెళ్ళాడు. మరి తిరిగి రాలేదు. మా రెండోవాడు చూశావా? వాడి స్థితి అలా ఉంది. ఇంకా ఇద్దరున్నారు. కుర్రాడు బి. కామ్. చదువుతున్నాడు. అమ్మాయి బి. ఎ. పాసయింది మొన్నే. వాడి చదువు, ఉద్యోగం, దీని పెళ్ళి నాకు సమస్యలు. ఈ బరువు బాధ్యత లెవరూ పంచుకోరు. చచ్చేదాకా నేనే మోయాలి" అని నిట్టూర్చారు.

"మీ ఇల్లెక్కడ, బాబూ!"

"పక్క వీధిలో."

"దగ్గరే, ఫర్వాలేదు. రోజూ వస్తూండు, నాయనా!" అన్నారు.

రోజులు, నెలలు, సంవత్సరమే గడిచింది. వారికే గాదు, ఇంటిల్లిపాదికీ స్నేహితు డయాడు తను. ఆ మనుషు లలాటివారు. కపటం, కల్మషం లేని హృదయాలు. అలాటివారికే అంత అశాంతి!

• • •

"మీ రింకా పడుకోలేదా, విజయ్ బాబూ!"

తుళ్ళిపడి చూశాడు సారథి.

"ఆఁ. లేదు. పడుకుంటా" అని లేచాడు.

ఫక్కున నవ్వింది రాజ్యలక్ష్మి.

"ఆ కిటికీలోంచి ఒకమారు బయటికి చూడండి" అన్నది.

చూశాడు. ప్రత్యూష కిరణాలతో అతి ప్రశాంతంగా ఉంది ఆకాశం.

"అరె! తెల్లారిపోయిందా?" అని తత్తరపడి, "ఇక నే వెళతాను. బాబాయి లేచాక చెప్పండి. మళ్ళీ సాయంకాలం వస్తాను" అన్నాడు వెళ్ళడానికి ఉద్యుక్తుడవుతూ.

"కాఫీ తాగి వెళుదురు గాని. ముఖం కడుక్కోండి, విజయ్‌బాబూ!" అని వెళ్ళిపోయింది రాజ్యలక్ష్మి.

"అలాగే" అని లోపలికి నడిచాడు సారథి.

(సశేషం)

# ఇక ప్రోగదు




(క్రిందటి సంచిక తరువాయి)

-ఎ. సర్వేశ్వరరావు

"పెద్దన్నయ్య మళ్ళీ తయారవుతున్నాడు.పదిరోజులెలాగయితేనేం ఇంట్లో ఉన్నాడు. మళ్ళీ తయారు." దూకుడుగా లోపలినుంచి వచ్చింది శ్యామల.

కుర్చీలో కూర్చుని శూన్యంలోకి చూస్తూ ఏదో ఆలోచిస్తున్న సారథి ఇటు చూశాడు. "దేనికి?" అన్నాడు. పరధ్యానంగా ఉండి ఆమె అన్నదేమిటో సరిగా వినిపించుకోలేదు.

"దేనికేమిటి— తాగడానికి. ఛీ! మనిషన్నాక బుద్ధుండాలి. తన చదువేమిటి, ఉద్యోగ మేమిటి? ఆ అలవాట్లేమిటి? ఛీ." అసహ్యంతో, ఆవేశంతో ఆమె ముఖం అరుణిమ దాల్చింది.

"అసలు నాన్నగారి మరణానికి వాడే కారకుడు. అహోరాత్రులు వాడిమీద బెంగతోనే క్రుంగిపోతుండేవారు. చివరికదే వారిని బలిగొంది."

"శ్యామూ!" స్నిగ్ధంగా చూశాడు సారథి.

"అవు నన్నయ్యా! మా ఇంట్లో ఎవరికీ ఇలాటి వ్యసనాలు లేవు. కనీసం సిగరెట్ కూడా ఎవరూ కాల్చేవారు కాదు. అలాటి వీడు ఇలా కావడమే వారికి సమ్మెట పోటయింది" అన్నది.

సారథి లేచాడు.మరగాళ్ళందుకున్నాడు.

"ఎక్కడి కన్నయ్యా?" వ్యాకులపాటుతో చూసింది శ్యామల.

"అన్నయ్య దగ్గరికి."

"వద్దన్నయ్యా! వద్దు. వాడి దగ్గరికి వెళ్ళవద్దు. ఎవరం ఏం చెప్పినా ప్రయోజనం లేదు. పైగా, కోపంతో ఏదో అని అవమానిస్తాడు" అన్నది భీతిగా చూస్తూ.

నవ్వాడు సారథి. "ఏమిటమ్మా నువ్వనేది! నేను మీ అన్నయ్యతో దెబ్బలాడటానికి వెళుతున్నా ననుకుంటున్నావా?" అని, "ఊహుఁ. అతని విషయం కాదు. ఇంటి విషయం మాట్లాడాలి" అన్నాడు.

"అయితే నువ్వే వెళ్ళడం దేనికి? కాస్సే పాగు. వాడే దిగి వస్తాడు. నువ్వు శ్రమపడి మెట్లెక్కేసరికి ప్రొద్దేపోతుంది.



ఇదీ భారతదేశం ఫోటో—పి. బి. షిండే (కొల్హాపూర్-2)

"పోనీ" అని లోపలికి నడిచాడు. మెట్లెక్కి పైకి వెళ్ళాడు. టాయిలెటుకు ఎక్కడికో వెళ్ళడానికి సిద్ధంగా ఉన్నాడు శ్రీకాంత్. బీరువాలోంచి ఏదో తీస్తున్నవాడల్లా మరగాళ్ల శబ్దం విని ఇటు తిరిగి చూశాడు.

"మీరా, విజయ్! ఏమి టిలా వచ్చారు? పనుంటే కబురంపితే నేనే వచ్చేవాణ్నిగా. మెట్లన్నీ అవస్థ పడి ఎక్కి వచ్చారు" అన్నాడు.

"ఫర్వాలేదు." గుమ్మం దగ్గరున్న కుర్చీ వానుకుని మరగాళ్ళు పక్కన పెట్టాడు. అన్నాళ్ళు ఆ ఇంట్లో తిరుగుతున్నా శ్రీకాంత్ గదిలోకి ఎప్పుడూ రాలేదు సారథి.

"ఎక్కడికేనా వెడుతున్నారా, శ్రీకాంత్?" అనడిగాడు కుర్చీలో కూర్చుని గది కలయజూస్తూ.

సారథి రాకా, అతని ఈ ప్రశ్నా శ్రీకాంత్ నెంతో చికాకుపరిచాయి. ఇంతకుముందే చెల్లెలు వచ్చి పరోక్షంగా ఏవో అనేసి వెళ్ళింది. కోపం వచ్చిందిగాని, ఏమీ అనలేకపోయాడు.

"నా రాక మీకు కష్టం కలిగిస్తే క్షమించండి, శ్రీకాంత్! నే వెళతాను" అని మరగాళ్లందుకున్నాడు. "అనుమతి లేకుండా మీ గదికి వచ్చినందుకూ, లేని చనువుతో మిమ్మల్నేదో అడిగి బాధ పెట్టినందుకూ మన్నించండి" అన్నాడు.

"విజయ్!" బాధగా చూశాడు శ్రీకాంత్. "వెళ్లకు, విజయ్, కూర్చో" అని, "అంతా తెలిసీ మీరూ నన్నెందుకు అలా అడుగుతారు?" అని అటు తిరిగిపోయి కిటికీ చెంత నిలబడ్డాడు. కాస్సేపు మెదలకుండా ఊరుకుని తరవాత మెల్లగా అన్నాడు:

"నాలో చెలరేగే సంఘర్షణా, అలుముకునే అశాంతీ మీ కర్థం కాదు, విజయ్! పరువూ, ప్రతిష్ఠా, ఉద్యోగం, గౌరవం నాకూ తెలుసు. కాని, ఏం చేయగలను? ఈ అశాంతినుండి కాస్సేపన్నా దూరం కావాలనే తాగుడు కలవాటుపడ్డాను."

"శ్రీకాంత్!" బాధగా చూశాడు సారథి.

"అవకాశముంది కాబట్టి మీ రీ పని చేయగలిగారు. లేనివా రేం చేయాలి, శ్రీకాంత్!"

"విజయ్!" అర్థం కానట్టు చూశాడు శ్రీకాంత్.

"ప్రేమించడం నేరమని నే ననను. ప్రియమైనది చేజారిపోతే విచారించని హృదయమూ ఉండదు. కాని, అలాగని బ్రతుకంతా అశాంతితో నింపుకుని చింతించడమే వివేకం కాదు, శ్రీకాంత్! నాలా నీవు ఏకాకివయితే సమస్యే లేదు. నీ బాధ పరులకు పట్టదు. నీ జీవితం ఇతరులకు సమస్య కాదు. కాని, మరో వ్యక్తిని మన జీవితంలోకి ఆహ్వానించినప్పుడు వారి కోసమైనా మనం మారక తప్పదు. కష్టమైనా, కఠినమైనా కన్నీరు గుండెలోనే దాచుకుని చిరునవ్వుతో బ్రతుకు సాగించక తప్పదు. మనం ఆశించినవారిని పొందలేక ఎంత బాధపడుతున్నామో, మనల్ని ఆశించినవారూ మన మందక అంతే బాధ పడతారని ఊహించడం కష్టమేం కాదు. అదీగాక ఎంత కష్టపడ్డా నేల రాలిన తారను మరల నింగి చేర్చడం అసంభవం. అది తెలుసుకోలేనంత అవివేకం..." అని ఇంకా ఏమేమో అనేంతలో గభాలున ఇటు తిరిగి అన్నాడు శ్రీకాంత్:

"ఆగు, విజయ్! ఆగు. నాన్నగారిలా నువ్వూ ఆ భ్రమలోనే ఉన్నావు. అసలు మీ ఉద్దేశం ఏమిటి? జయను నేను ప్రేమించాననే కదూ? అది దక్కక భగ్నహృదయుణ్నయి దేవదాసులా తాగుబోతు నయాననే కదూ? హుఁ. కానే కాదు, విజయ్! కానేకాదు. నా దృష్టికి జయ ఎంతో, రాజూ అంతే." ఆవేశంతో ఊగిపోతూ అన్నాడు శ్రీకాంత్.

దిమ్మెరపోయాడు సారథి.

"నిజం మీకు తెలియదు. చెప్పినా అర్థం చేసుకోలేరు. కాని, మీరు చేయగలిగిందల్లా ఊహలతో మనసుల్ని గాయపరచడమే. మనుషుల్ని అవమానించడమే." సిగరెట్ వెలిగించి పొగ విడుస్తూ శూన్యంలోకి తీక్ష్ణంగా చూడసాగాడు శ్రీకాంత్.

షాక్ తిన్న సారథి మెల్లగా తేరుకుని, "నన్ను క్షమించు, శ్రీకాంత్! నిజం నాకూ తెలియదు. నాన్నగారన్నా మొదట నమ్మలేదు. కాని, ఆ వేళ మీ పర్సులో జయలక్ష్మిగారి ఫోటో..." అనేంతలో శ్రీకాంత్ ఇటు తిరిగి చూసి— "ఫోటో చూసి కథ అల్లుకున్నారు. ఊహ నిజమైందని సంతోషించారు. కాని, ఒక్క సంగతి, విజయ్! అస లా పర్సు నాది కానే కాదు. మైకంతో ఆ రోజు రాజు పర్సు, నా పర్సు తారుమారయ్యాయి. అయితే..." అన్నాడు.

"రాజు అంటే?" విస్మయంగా అడిగాడు సారథి.

"జయలక్ష్మి ప్రియుడు. ఒకప్పుడు శంకరం మామయ్య జీపు డ్రైవరు."

అశనిపాతం చెందాడు సారథి.

"కాని, జయ ఇప్పుడు లేదు, విజయ్! టైఫాయిడ్‌తో ఎప్పుడో అంతరించింది. ఆ అశాంతితోనే వాడూ నాలా తాగుడుకి బానిసయ్యాడు" అని తల పంకించి, "బిడ్డమీద బెంగతో తండ్రి ఆత్మహత్య చేసుకుంటే, తండ్రిమీద బెంగతో అది మంచమెక్కి అంతమైపోయింది. జయ లేచిపోవడం నాకు తెలుసు. గుళ్లో జరిగిన వారి పెళ్లికి ముఖ్య సాక్షిని నేనే!" అన్నాడు.

అతను చెప్పేది వింటూ తనను తాను నమ్మని స్థితికి లోనయ్యాడు సారథి.

"రాజు విషయంలో నేను భయపడిందందుకే, విజయ్! అదీ ఎవరినన్నా ప్రేమించిందేమో? జయలా అది ధైర్యవంతురాలు కాదు. మనసులోని మాట ఎవరికీ చెప్పలేక తండ్రి మాట కోసం, తల్లి సంతోషం కోసం, పెద్దల పరువు కోసం అంగీకరిస్తున్నదేమో అనుకొన్నాను. మనిషిని కొన్నాళ్లేనా తెలిసి ఉంటే తప్ప ఆ మనసు గ్రహించడం కష్టం. కాని, ఆగలే దీ పెద్దలు. . ."

"అయినంతలో ఏమయింది, శ్రీకాంత్?"

"ఏమీ కాలేదనే మీ రనుకుంటున్నారు. కాని, ఏముందో నాకు తెలుసు" అని క్షణం ఆగి మళ్లీ అన్నాడు: "పెళ్లి పీటలమీదే నా కనుమానం వచ్చింది. అక్క కూర్చోవలసిన పీటమీద తను కూర్చోవలసి వచ్చిందన్న బాధతో కన్నీరు నింపిందనుకున్నాను. కాని, ఆ సాయంకాలం పెరట్లో. . ." అని ఆగి వేలితో కిటికీలోంచి చూపుతూ, "అటు చూడు, విజయ్!" అన్నాడు. విస్మయంగా తన చెంతనున్న కిటికీలోంచి చూశాడు సారథి. పెరట్లో బావిచెంత గన్నేరు మొక్కల దగ్గర రాజ్యలక్ష్మి నిలబడి ఉంది.

"అదిగో, అక్కడే ఆనాడూ ఆమె నిలుచుని ఎవరితోనో మాట్లాడుతోంది."

ఎందుకో ఆ మాట వింటూనే గజగజ వణికాడు సారథి.

తలవని తలంపుగా అటు వెళ్ళిన నేను వారి మాటలన్నీ విన్నాను. కాని, ఆ వ్యక్తిని చూడలేక పోయాను. నా కాళ్ళ కింద భూమి కదిలిపోయినట్లయింది.

రాజా హృదయం ఎంత అగాధం! వారి ప్రేమ ఎంత నిగూఢం! నా ఉనికే నాకు సిగ్గనిపించింది. కాని, నే నప్పు డేం చేయలేను. కొన్ని గంటల క్రితమే అగ్నిసాక్షిగా ఆమె నా ఇల్లా లయింది. రేయి నా చెంతకు వచ్చింది. ఆమె రాలేదు. అలంకరించి అమ్మలక్కలు బలిమిని గదిలోకి నెట్టారు—'ఇక నీ కర్మ అనుభవించు' అన్నట్లుగా,

''ఆచారాల పేరిట, పెద్దల వేడుక కోసం, పరువు ప్రతిష్ఠల పేరిట ఎన్ని అమాయక కన్నె జీవితా లిలా బలి అవుతున్నాయో నీకు తెలియదు, విజయ్!

''మనకంటె ఎక్కువగానే ప్రేమిస్తుంది స్త్రీ. కాని, మనలా తేలిపోదు. తెలివిగా జీవితంలో రాజీ పడిపోతుంది. ఎంతటి జ్వాలనైనా గుండెలోనే ఆర్పి కనుల చిరునవ్వుతో కలకల లాడుతుంది. ఆ నేర్పు, ఆ సహనం వారి సొత్తు. మన కది చస్తే చేతకాదు. అందుకే భంగపడతాం. పిచ్చి వెధవలమవుతాం.

''ఎన్నో నిమిషాలు గడిచినాయి. కాని, ఆమె కదలలేదు, మెదలలేదు. పెదవి కదిపి పలకలేదు. నేనూ అంతే. ఎలా మాట్లాడాలి? ఏం మాటాడాలి?

'రాజా!' చివరికి నేనే పిలిచాను.

తల ఎత్తి చూసింది.

'ఇటు రా.' మెల్లగా నా చెంతకు వచ్చింది, నేల చూపులు చూస్తూ.

'అలా కూర్చో' అన్నాను కాని, ఆమె కూర్చోలేదు.

'న న్నిష్టపడే చేసుకున్నావా?' ఆమె మాటాడలేదు. తల ఎత్తలేదు.

'నిజం చెప్పు, రాజా! కాదు కదూ? ఈ పెద్దలంతా నిన్ను ఒప్పించారు కదూ?'

అప్పుడు తల ఎత్తింది. బెదురు చూపులు చూసింది.

'బావా!' ఆ కళ్ళలో అశ్రువులు తొణికిసలాడినాయి.

'ఒక మాట అడుగుతా. నిజం చెబుతావా, రాజా!'

ఏమి టన్నట్లు చూసింది.

'సాయంకాలం పెరట్లో గన్నేరు మొక్కల చాటున నీతో మాట్లాడిం దెవరు?' అంతే. ఆ మాటతో ఆమె ముఖం వివర్ణమై పోయింది.

'బావా!' దెబ్బ తిన్న లేడిలా చూసింది.

'చెప్పు, రాజా! నే నేమీ అనుకోను.' కాని, ఆమె చెప్పలేదు. చెప్పదుకూడా. ఏమంటే, అలా అడగడంలో నా ఉద్దేశ మేమిటో ఆమెకు తెలియదు. తెలిసినా చెప్పదేమో? స్త్రీ అంతర్యమే అది, విజయ్!

'నువ్వతణ్ణి ప్రేమించావు కదూ?'

గజగజ వణికిపోయింది. 'నిజం చెప్పు, రాజా! నే నేం అనుకోను.'

'బావా!' వలవల ఏడవసాగింది.

'నన్ను అనుమానించకు, బావా! అతను నా కేమీ కాదు. మా నాన్నగారి స్నేహితుడు. అంతే. నన్ను నమ్ము బావా! నేను పవిత్రురాల్ని. . .'

ఆమె అమాయకతకూ, బేలతనానికీ నాకే నవ్వు వచ్చింది.

'పిచ్చిదానా! ని న్ననుమానించాననీ, అపవిత్రురాలి వనుకున్నాననీ ఎలా ఊహించావు? నా భావ మది కాదు, రాజా! ఛ ఛ. ఏడవకు. . .' ఎంత

ఇదుగో! నోటికంతా రక్షణ చేకూర్చే

టూత్ పేస్ట్ —నీమ్

నీమ్ టూత్ పేస్ట్ మీ పళ్ళను శుభ్రపరచడమే గాదు, నీమ్ టూత్ పేస్ట్‌లో ఆరోగ్య ప్రదాయిని వేప (నీమ్)కు వుండే అద్భుత లక్షణాలన్నీ వున్నాయి. పళ్ళను గట్టిపరిచి చిగుళ్ళకు రక్షణ చేకూర్చి, దుర్వాసనను నివారించి, మీ నోటిని సర్వదా స్వచ్ఛంగా వుంచుతుంది.




కలకత్తా కెమికల్ వారి ఉత్పత్తి

ఓదార్చినా ఆమె ఏడవడం మానలేదు. ఎంత సముదాయించినా, ఎంత హామీ ఇచ్చినా ఆమె నిజం చెప్పలేదు. ఎలా చెబుతుంది? ఆమె పుట్టింది పవిత్ర భారత దేశంలో. ఆమె పెరిగింది సనాతన సంప్రదాయాలమధ్య. మరి అలాంటప్పుడు పెద్దల అనుమతి లేకుండా ఎవర్నో ఎలా ప్రేమించిందో నా కర్థం గాలేదు.

'ఏమీ తెలియకపోతే ఏం లేదు. కాని, అంతా తెలిసీ ఆమె నన్యాయం చేయలేను. చివరి కదే చెప్పాను.

'నేను నిన్ను శంకించలేను, రాజా! అలాగని స్వీకరించనూ లేను. అత నెవరో చెప్పు. ఎక్కడున్నా, ఎలాటి వాడన్నా తీసుకు వస్తాను. మళ్లీ పెళ్లి చేస్తాను.'

'బావా!' బిత్తరపోయింది.

'న న్నంత నీచంగా ఎలా ఆలోచిస్తున్నావు? నన్ను నమ్మ, బావా! నే నెవర్నీ ప్రేమించలేదు. ఎవర్నీ నమ్మకోలేదు. నమ్మిందీ, ఆశ్రయించిందీ నిన్నే' అన్నది.

'ఆ ప్పీ మాట ఎందు కంటున్నావో నాకు తెలుసు, రాజా! కాని, న న్నర్థం చేసుకోవడం లేదు. నీ నుండి నిజం తెలుసుకుందామనే అలా అడగడం లేదు. నేను నీ కేమీ అన్యాయం చెయ్యను. అత నెవరో చెప్పు...' కాని, ఆమె చెప్ప లేదు. చెప్పకపోగా చర్రున లేచింది.

'బావా! నిజం చెప్తున్నాను. నే నెవర్నీ ప్రేమించలేదు. ఎవర్నీ మోహించలేదు. తెలిసిన వ్యక్తితో చనువుగా మాట్లాడి నంత మాత్రాన నీచంగా ఊహించి ఇంత దారుణంగా మాట్లాడుతున్నావ్. నీ కిష్టమున్నా, లేకపోయినా అగ్నిసాక్షిగా నీ ఇల్లాలి నయ్యాను. నా బ్రతు కింక ఇక్కడే. నువ్వు పొమ్మంటే పోయి ఏ గంగలోనో దూకి చస్తాను. కాని, ఇలా మాటలతో నన్ను చిత్రవధ చెయ్యవద్దు' అన్నది. అంతే. మరో మాట చెప్పదు. నాకు తెలిసిన వివరాలతో అతనికై అన్వేషించాను. కాని, ఎక్కడా జాడ దొరకలేదు'' అని నిట్టూర్చాడు శ్రీకాంత్.

సిగరెట్ వెలిగించి, ''కాని, విజయ్!'' అని ఇటు తిరిగాడు. సారథిలో చలనం లేదు. బొమ్మలా కుర్చీలో కూర్చుండి పోయాడు. కనుల జారిన కన్నీరు చెంపల మీద నిలిచి మలినం కావించాయి అతని వదనాన్ని.

''చీకటి పడింది, విజయ్, లైటు వేద్దాం'' అన్నాడు. స్విచ్ సారథి కూర్చున్న కుర్చీపైన ఉంది. తను వేయాలంటే అతనిపై వంగి వేయాలి. అందుకే అలా అన్నాడు శ్రీకాంత్.

''విజయ్!''

''ఆఁ.'' తేరుకున్నాడు సారథి.

''స్విచ్ వేయి, విజయ్!'' చేయెత్తి స్విచ్ వేశాడు. వెలుగులో అతని ముఖం చూసిన శ్రీకాంత్ విస్మితుడై, ''అదేమిటి, విజయ్! మీరు ఏడుస్తున్నారా!'' అన్నాడు.

''లేదు, లేదు'' అని చొక్కా చేతితో ముఖం తుడుచుకున్నాడు సారథి.

''ఏమో అనుకున్నాను. కాని, మీరూ బేలహృదయులే'' అని హఠాత్తుగా పైకి చూశాడు శ్రీకాంత్.

''ఎవ రక్కడ?'' అన్నాడు వంగి చూసి.

''నేను'' అని ముందుకు వచ్చి, ''కాఫీ'' అన్నది రాజ్యలక్ష్మి, బెదురుగా చూస్తూ.

''న వ్విక్కడే ఉన్నావా?'' సూటిగా



చూస్తూ అడిగాడు.

"లేదు. ఇప్పుడే వచ్చాను"అని, "కాఫీ తెమ్మంటారా" అన్నది.

"నా కక్కర లేదు" అని సారథి వంక చూసి, "మీకు కావాలా?" అనడిగాడు.

"ఊహూఁ" అన్నాడు సారథి. రాజ్యలక్ష్మి వెళ్ళిపోయింది.

ఆమె వెళ్ళిన వంకే చూస్తూ మందహాసం చేశాడు శ్రీకాంత్.

"చూశారా, విజయ్! నేనంటే ఆమె కెంత భయమో! ఇలాటి వ్యక్తితో ఎలా రాజీపడి జీవించమంటారు?" అన్నాడు.

సారథి ఏం మాట్లాడలేదు.

భారంగా నిట్టూర్చి, "మొదట్లో అలానే రాజీ పడదామనుకున్నాను కాని, జయ మరణం, రాజా పతనం నన్ను ఘోరంగా కలచినాయి" అన్నాడు.

"అయితే, ఏం చేయాలనుకుంటున్నారు మీరు?" సూటిగా అడిగాడు సారథి." అతను కనిపిస్తే ఏం చేదామని?"

"రాజా నిచ్చి పెళ్లి చేస్తాను." స్థిరంగా అన్నాడు శ్రీకాంత్.

"ఆమె చేసుకుంటుందా?"

"ఎందుకు చేసుకోదు?"

"చేసుకుంటుందని మీ రెలా అనుకుంటున్నారు?"

"చేసుకోదని మీ రెలా అనుకుంటున్నారు?"

శుష్కహాసం చేశాడు సారథి. "స్త్రీ హృదయం మీ కంటె నాకు బాగా తెలుసు, శ్రీకాంత్! తెలిసో, తెలియకో కన్నె హృదయాలు ఏవేవో ఆపేక్షిస్తాయి. అమాయకత్వంతో ఆరాధిస్తాయి. అందితే సంతోషమే! అందకపోతే బాధే లేదు. అందినదాన్నే ఆరాధిస్తూ తమ సర్వస్వం అర్పిస్తారు. రాజా మనసూ అంతే, శ్రీకాంత్! నువ్వు ఊహించిందేం లే దక్కడ."

"అంతేనా!"

"అవును. మీ జయ ప్రియుడు రాజాను దృష్టిలో పెట్టుకుని నువ్వేమో ఊహించుకుని బాధ పడుతున్నావు. కాని, అంతా ఒకలా ఎప్పుడూ ఉండరు, శ్రీకాంత్! ప్రతి చిన్న విషయానికీ కరిగి నీరయే నవనీత హృదయాలు కొన్నయితే, ఎంతటి ఆఘాతాన్నయినా తట్టుకుని నిండుగా నిలిచే బండ హృదయాలు కొన్ని. రాజ్యలక్ష్మిని ప్రేమించిన వ్యక్తి అంతే."

"కాదు. ప్రగాఢంగా ప్రేమించినవా డెన్నటికీ అలా ఉండలేడు."

ఆవేశంతో లేచి నిలబడ్డాడు సారథి.

"ఉంటాడు. ఉన్నాడు, శ్రీకాంత్ ఉన్నాడు" అన్నాడు.

"ఏమిటి, విజయ్, ఏమిటను వ్వన్నది? ఎక్కడున్నా డతను? నీకు తెలుసా?"

శ్రీకాంత్ ప్రశ్నతో సారథి ఆవేశమంతా దిగిపోయింది. వ్యథాందోళనతో కూర్చుండి పోయాడు.

"చెప్పు, విజయ్!" చెంతకు వచ్చి సారథి భుజాలు పట్టి కుదుపుతూ ఆసక్తితో అడగసాగాడు శ్రీకాంత్.

"చెబుతా. కాని, ముం దిది చెప్పు. అతను కనిపిస్తే ఏం చేస్తావ్? రాజా నప్పగించి పొమ్మంటావా?"

"అలా ఎందు కంటాను? వారి అభిప్రాయ మడిగి. . ."

"సరే. అది నేనే చెబుతున్నాను, విను. అతను అంగీకరించడు."

"ఎందుకని?"

"అతను మనిషి కాబట్టి. ఆస్వాదించినా, ఆస్వాదించకపోయినా ఒకరికి పూజ చేసిన పూవును మరొకరి పూజ కంగీకరించరు. గతంలో ఎంత ప్రేమించినా, ఆమె ఇప్పుడు మరొకరి ఇల్లాలు. ఆమె ఊహే ధర్మవిదూరం. ఎంతటి సంస్కారి అయినా, ఆ త్యాగధనా న్నతను స్వీకరించలేడు. ఇక అప్పుడు నీ కర్తవ్య మేమిటి? రాజా భవిష్యత్తేమిటి. . .?"

శ్రీకాంత్ మూఢుడిలా చూశాడు.

"అప్పుడు. . . అప్పుడు" అని శూన్యంలోకి పిచ్చివాడిలా చూసి మాటలు తడుముకుంటూ, "విధితో రాజీపడి. . ." అనగా, అన్నాడు సారథి:

"ఆ పని ఇప్పుడే చేయి, శ్రీకాంత్! నీ మొదటి ఉద్దేశానికి తిలోదకా లివ్వు. రెండో ఉద్దేశానికే విలువ ఇవ్వు. అంతే. అప్పుడే నువ్వు నిజమైన త్యాగమూర్తి వవుతావు."

"అదంతా నీ ఊహ, విజయ్! కాని, అలానే ఎందు కవుతుంది?"


పండుగలకు ఫిలిప్స్ రేడియోలు కొనండి

ఇంటికి అన్నివిధాల ఆనందం అందరికి చేకూరుతుంది

మన్నిక, శ్రావ్యతకు గ్యారంటీ అయినది.

రెండు బ్యాండుల ట్రాన్సిస్టరు
ఫిలెటినా



వెల రు. 177/-
తదితర పన్నులు అదనం

PHILIPS

మూడు బ్యాండుల ట్రాన్సిస్టరు
ఫిలెటా



వెల: రు. 275/-
తదితర పన్నులు అదనం

వివరములకు: మోడరన్ రేడియో & ఎలక్ట్రికల్స్,
మారుతీ సినిమాకు ఎదురుగ
పోస్టు బాక్సు నెం. 156
కాన్వెంటు వీధి,
ఫోను: 74118
విజయవాడ-1.

"అవుతుంది. అవక తప్పదు... ఏమంటే... ఏమంటే..." అని లేచి మరగాళ్ళ చంకల క్రింద ఉంచి నడిచి గది గుమ్మం దాటి, హఠాత్తుగా ఆగి అన్నాడు:

"ఏమంటే, ఆ వ్యక్తిని నేనే!" అదిరిపడ్డాడు శ్రీకాంత్.

"అవును, శ్రీకాంత్! అతణ్ణి నేనే. నువ్వు ఊహించినట్టు రాజును ప్రగాఢంగా ప్రేమించాను. కాని, ఇప్పుడా తలపులే అసంభవం. పగిలిన ఈ వీణ ఇక సుస్వరాలు పలకనేరదు, శ్రీకాంత్! నీ సహృదయానికీ, స్వార్థ త్యాగానికీ ఇవే నా జోహార్లు. కాని, ఇన్నాళ్ళూ నీ బాధ ఇదని తెలిసి ఉంటే ఈ మాట ఎప్పుడో చెప్పి ఉండేవాణ్ణి. ఇప్పుడేనా మించిపోయిందేం లేదు, శ్రీకాంత్! పిచ్చి ఊహలతో, అర్థంలేని ఆలోచనలతో జీవితాన్ని నరకం కావించుకోవద్దు. రాజు పవిత్ర హృదయం. అమృతమూర్తి. ఆ భాండంలో గరళం నింపకు, శ్రీకాంత్! నిన్ను నీవే వంచించు కోకు... గుడ్‌బై..." అని చరచర సాగిపోయాడు.

శ్రీకాంత్ తేరుకుని అతని పోకను గుర్తించి, "ఆగు, విజయ్! ఆగు. మెట్ల మీద లైటు లేదు. చీకటి." అని హెచ్చరించేంతలోనే దబ్బున చప్పుడైంది.

"విజయ్! విజయ్! ఏమైంది, విజయ్!" కాతర స్వరంతో పిలుస్తూ మెట్ల దగ్గరికి వచ్చాడు శ్రీకాంత్. గబగబ దిగాడు. అతని హెచ్చరికే నిజమైంది. చీకటిలో కనిపించక ఒక మెట్టుపై మరగాలూ, మరొక మెట్టుపై కాలూ పడి జారి దొర్లిపోయాడు సారథి. అన్ని వంపులు తిరిగి కింద పడేసరికి తల పగిలి పోయింది.

"అన్నయ్యా!" మీదపడి బావురుమంటూంది శ్యామల.

"వద్దంటున్నా వినక పైకి ఎందుకు వెళ్ళావు, అన్నయ్యా!"

"విజయ్‌బాబూ!" చేరువన నిలబడి నోట్లో చెంగు కుక్కుకుని మూగగా రోదిస్తూంది రాజ్యలక్ష్మి. ఆ దృశ్యం చూసి వికలమైపోయింది శ్రీకాంత్ మనసు. దోషిలా కళ్ళప్పగించి చూస్తూ ఉండిపోయాడు.

'గుడ్‌బై!' దేహంలోంచి ప్రాణం పారిపోయినా, ఆ పెదవులింకా ఆ పదాన్ని ఉచ్చరిస్తున్నట్టే అనిపించసాగింది. పదే పదే అదే మాట వినిపించసాగింది శ్రీకాంత్‌కి. ★


అనన్య సామాన్య ప్రచారంగల తెలుగు వారపత్రిక
ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక




# అమృతాంజనం
## చప్పున పోగొడుతుంది!

తలనొప్పి, జలుబులు, బెణుకులు, కండరాలనొప్పి—వీటిని చప్పున చల్లగా తగ్గించుకోండి. దారగా చిన్న చోటుమీద అమృతాంజనం రాయండి. వెంటనే గుణం ఇస్తుంది. 75 సంవత్సరాలపైగా ఇంటింటి దీపమై వెలుగుతోంది అమృతాంజనం! ఎప్పుడూ ఒక సీసా దగ్గర ఉంచుకోండి. అమృతాంజనం అరాచేటి పెద్ద సీసాలలోనూ, చిన్న తళ్ళాలలోనూ దొరుకుతోంది.

అమృతాంజనం 10 ఔషధాలు కలిసినది నొప్పులను, జలుబులను చప్పున, చల్లగా తగ్గిస్తుంది.

అమృతాంజన్ లిమిటెడ్ AM-5581

పద్యవైద్యశాల (ప్రైవేట్) లిమిటెడ్, నంజన్‌గూడు
ఆయుర్వేద విద్వాన్ బి. వి. పండిట్ గారి నమ్మకమైన మందులు
ఇవుడు మీకు మిక్కిలి గుణము పెంపొందించబడినవి.

మీ పండ్లకు చాల ఉత్తమమైనది, నిరపాయకరమైనది.

## నంజన్‌గూడు పండ్లపొడి

అసలునే కొనండి I.D.L.61 ఔషధయుక్తమైనది. నకళ్లను వాడవద్దు

బిడ్డలకు కాస్మస్ కస్తూరి మాత్రలు | కర్జన్ గోరోజన మాత్రలు | బాలక్స్ విరేచన మాత్రలు

సోల్ ఏజంట్లు: యునైటెడ్ కన్సర్న్, 54, బందరువీధి, మద్రాసు.

బ్రాంచీలు: విజయవాడ, హైదరాబాద్ పండరిక్ అండ్ కం., సుభాన్‌రోడ్డు, సికింద్రాబాద్